క్లుప్తంగా

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్‌: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.15, వంకాయ రూ.23, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్‌ రూ.13, క్యాబేజీ రూ.15, క్యారెట్‌ రూ.35, దొండ రూ.47, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.39, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.18, సొరకాయ రూ15, పొట్లకాయ రూ.23, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.37, మునగ రూ.85, చిలుకడ దుంప రూ.60, బీట్‌రూట్‌ రూ.35, కీర రూ.35, బీన్స్‌ రూ.45, క్యాప్సికమ్‌ రూ.43. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న షఫీఉద్దీన్‌

చాదర్‌ఘాట్‌: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌ అఫ్జల్‌నగర్‌లో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను సోమవారం కార్పొరేటర్‌ షఫీఉద్దీన్‌ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలన్నారు.

సీనియర్‌ సిటిజన్స్‌ సంక్షేమానికి కృషి



సీనియర్‌ సిటిజన్స్‌తో కార్పొరేటర్‌

వనస్థలిపురం: సీనియర్‌ సిటిజన్స్‌ సంక్షేమానికి కృషి చేస్తానని వనస్థలిపురం డివిజన్‌ కార్పొరేటర్‌ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌ పరిధిలోని క్రాంతి హిల్స్‌ కాలనీ కమ్యూనిటీ హాల్లో సీనియర్‌ సిటిజన్స్‌ కోసం ఏర్పాటు చేసిన చెస్, క్యారంబోర్డు సౌకర్యాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బద్దం రాంరెడ్డి, సత్తిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల అందజేత



పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న దృశ్యం

మలక్‌పేట: విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించాలని ప్రధానోపాధ్యాయులు శశికళ అన్నారు. గంటా అరవింద్‌ పటేల్‌ ఆధ్వర్యంలో మూసారంబాగ్‌లోని బాగ్‌మూసారిమో జీపీ స్కూల్‌కు చెందిన 165 మంది విద్యార్థులకు సోమవారం పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. 10వ, తరగతి చదువుతున్న 45 మంది విద్యార్థులకు ఫైల్‌ ఫోల్డర్స్‌ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి గీత, జనమిత్ర, నాయకుడు రాకేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవయవదానం



కేశ అలివేలు (ఫైల్‌)

మన్సూరాబాద్‌: తాను మరణిస్తూ ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపింది ఓ గృహిణి. జీవన్‌దాన్‌ ప్రతినిధులు వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్‌ జిల్లా కల్వకుర్తి మండలం వేపూర్‌ గ్రామానికి చెందిన కేశ అలివేలు(53) ఈ నెల 2న ఇంట్లో అకస్మాతుగా కింద పడిపోయింది. కుటుంబ సభ్యులు వెంటనే ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స అందించిన వైద్యులు ఈ నెల 6న బ్రెయిన్‌డెడ్‌ అయినట్లు ప్రకటించారు. మృతురాలి భర్త చిన్న రాములు, కుమారులు మల్లేష్, మహేష్, నగేష్‌కు అవయవదానంపై అవగహన కల్పించి వారి అంగీకారంతో అలివేలు లివర్, రెండు కిడ్నీలు, రెండు కార్నియాలను జీవన్‌దాన్‌ను దానం చేశారు.

బీజేపీ కార్యాలయంపై దాడి సరికాదు

మహేశ్వరం: నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్‌ నాయకులు దాడి చేయడం పిరికిపంద చర్య అని బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఈరంకి విశ్వనాథ్‌గౌడ్‌ అన్నారు. మంగళవారం ఆయన మామిడిపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ అధికారం చేపట్టి ఏడాది అయ్యేసరికి ఒంటెత్తు పోకడలు, నియంతపాలనను అవలంబిస్తుందన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన అనంతరం హామీలను విస్మరిస్తున్నారన్నారు.మహిళలకు రూ.2500ల ఆర్థికసాయం, రూ.15వేల రైతు భరోసా లాంటి పథకాలకు ఎగనామం పెట్టారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే దాడులకు తెగబడడం సరికాదన్నారు. పార్టీ అధిష్ఠానం మాటకు కట్టుబడి ఉన్నామని, బీజేపీ కార్యకర్తలు తలుచుకుంటే కాంగ్రెస్‌ నాయకులు రోడ్లపై తిరగరని హెచ్చరించారు.

90 రోజుల ప్లాన్‌.. మురుగు సమస్యలు మాయం

- జలమండలి ప్రణాళికలతో సత్ఫలితాలు
- ఇప్పటి వరకు 8366 మ్యాన్‌హోళ్లు శుభ్రం



పూడికతీత పనులు పరిశీలిస్తున్న జీఎం శ్రీనివాస్‌రెడ్డి

ఎల్‌బీనగర్‌: జలమండలి ఆధ్వర్యంలో చేపట్టిన 90 రోజుల మురుగు ప్రణాళికకు సత్ఫలితాలు వస్తున్నాయి. గతంలో ఏ గల్లి చూసినా మురుగు ఏరులై పారుతుండటంతో ఆయా ప్రాంతాల వారు దుర్గంధం, దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అయ్యేవారు. ఇప్పుడు ఆ సమస్యకు స్వస్తి పలికేందుకు జలమండలి అధికారులు చేపట్టిన 90 రోజుల మురుగు శుద్ధి ప్రణాళికతో సత్ఫలితాలు వస్తున్నాయి.

ఎల్‌బీనగర్‌ 11 డివిజన్‌ పరిధిలో 90 రోజుల ప్రణాళికలతో సుమారుగా 8,366 మ్యాన్‌హోళ్లను శుభ్రం చేశారు. ఇదంత గత అక్టోబర్‌ నుంచి డిసెంబర్‌ 31 వరకు చేపట్టిన ప్రణాళికలో అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఈ మ్యాన్‌హోళ్లను శుభ్రం చేశారు. 122.661 కిలో మీటర్ల భూగర్భ డ్రైనేజీని శుభ్రం చేశారు. కలుషిత నీటి సరఫరాలో నెలకు సుమారుగా 540 వరకు ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. మంచినీటి సరఫరాలో తీసుకున్న జాగ్రత్తలతో ఇప్పుడు వచ్చే ఫిర్యాదులు సైతం తగ్గినట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పుడు కేవలం 400 వరకు మాత్రమే ఫిర్యాదులు వస్తున్నాయి. మ్యాన్‌హోళ్లల్లోని పూడిక తీయడంతో మురుగు నీరు రోడ్లపైకి రాకుండా తీసుకున్న జాగ్రత్తతో ఫిర్యాదులు తగ్గుముఖం పట్టాయంటున్నారు. గతంలో 70 శాతం ఓవర్‌ ఫ్లో ఉండేదని ప్రస్తుతం కేవలం 30 శాతం మాత్రమే ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

ఫిర్యాదులు తగ్గాయి..

మురుగు సమస్యల శాశ్వత పరిష్కారానికి జలమండలి ఆధ్వర్యంలో చేపట్టిన 90 రోజుల కార్యచరణ సత్ఫలితాలు ఇస్తున్నాయి. గతంలో వచ్చే ఫిర్యాదులో 70 శాతం తగ్గాయి. అందుకే మరోసారి 90రోజుల కార్యచరణ ప్రణాళికను మురుగు సమస్యపై ప్రభుత్వం దృష్టి సారించింది. కిందిస్థాయి అధికారులు, సిబ్బంది సహకారంతో మురుగు సమస్య నియంత్రణపై దృష్టి సారించాం.

–శ్రీనివాస్‌ రెడ్డి, జలమండలి జీఎం

ప్రాంతాల వారీగా చేపట్టిన పనుల వివరాలు..

ప్రాంతం	మ్యాన్‌హోళ్లు	పూడికతీసిన కి.మీ	తీసినచెత్త టన్నుల్లో
బీఎర్‌రెడ్డి నగర్‌	866	13.04	18.85
ఎన్‌జీఓ కాలనీ	946	16.03	20.91
వనస్థలిపురం	901	12.30	28.27
కమలానగర్‌	893	14.51	21.15
నాగోలు	1644	21.79	43.64
ఆటోనగర్‌	1043	14.33	23.32
మన్సూరాబాద్‌	1100	13.96	25.31
ఎల్‌బీనగర్‌	973	16.69	27.22
మొత్తం	8366	122.661	208.668

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

సైదాబాద్‌: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌గఢ్‌ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..

ఏపీఏయూ కాలనీ, గడ్డిఅన్నారం, వెంకటేశ్వర కామర్స్‌ కాలేజ్, తిరుమల హిల్స్, ఇండస్‌ ల్యాండ్‌ బ్యాంక్, వాణిజ్యవిహార్, నలందా కాలేజ్, బిగ్‌–సీ, గురుదాస్, సలీంనగర్, రామారావ్‌ కంపెనీ, సలీంనగర్‌ మిల్క్‌బూత్‌ డౌన్, పద్మావతీ అపార్ట్‌మెంట్స్, సలీంనగర గణేష్‌ టెంపుల్, రవూఫ్‌ నగర్, జమాల్‌ కాలనీ, రాజు నగర్, అబూబకర్‌ మాస్క్, లలితాబాగ్, మొయిన్‌బాగ్‌ పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 వరకు..

సైదాబాద్‌ 2ఆర్‌టీ మెయిన్‌రోడ్, వెంగళ్‌రావ్‌ పీటీ, సైదాబాద్‌ రామాలయం, ఎస్‌బీహెచ్‌ ఆఫీసర్స్‌ కాలనీ, లక్ష్మీనగర్‌ సాయిబాబా టెంపుల్, ఇంద్రానగర్, డీబీఆర్‌ డయాగ్నస్టిక్‌ సెంటర్, ఎస్‌ఆర్‌ఎం కాలేజ్‌ ఏరియా, దిల్‌సుఖ్‌నగర్‌ డిపో, రేమాండ్‌ షోరూం, విజయ డయాగ్నస్టిక్‌ సెంటర్, మారుతీ మందిర్, దిల్‌సుఖ్‌నగర్‌ మెయిన్‌రోడ్, చిల్డ్రన్స్‌ జైల్, రక్షాపురం టింబర్‌ డిపో, అక్బర్‌ పీటీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌ అంతరాయం ఉంటుందన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

నాగోలు: నేటి బాలలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులకు రోడ్డు భద్రత, ప్రమాదాలపై అవగాహన కల్పిస్తే ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించుకోవచ్చని నాగోల్‌ ఇన్‌చార్జ్‌ ఆర్టీఓ అమర్నాథ్‌ సూచించారు. రోడ్డు భద్రతా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం నాగోలు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కారులో ప్రయాణిస్తే సీటు బెల్టు, బైక్‌పై హెల్మెట్‌ ధరించాలన్నారు. వాహనాలను నడిపే సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడవద్దని అత్యవసర పరిస్థితుల్లో వాహనాన్ని ఆపి మాట్లాడాలని సూచించారు. తోటి అధికారులతో పాటు విద్యార్థులతో ట్రాఫిక్‌ నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

జాతీయస్థాయి సైక్లింగ్‌ పోటీలకు చరితరెడ్డి ఎంపిక



నాగోలు: జాతీయస్థాయి సైక్లింగ్‌ పోటీలకు కర్మన్‌ఘాట్‌కు చెందిన చరితరెడ్డి ఎంపికైంది. కీసరలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్‌–14 విభాగం ఎస్‌జీఎఫ్‌ సైక్లింగ్‌ పోటీల్లో గోల్డ్‌ మెడల్‌ సాధించిన చరితరెడ్డి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం ముషిపట్ల గ్రామానికి చెందిన నరేందర్‌ రెడ్డి–ఝాన్సీ దంపతులు జీవనోపాధి కోసం నగరానికి వచ్చి కర్మన్‌ఘాట్‌లో ఉంటున్నారు. మీర్‌పేటలోని శ్లోక పాఠశాలలో వీరి కుమార్తె చరితరెడ్డి 7వ తరగతి చదువుతుంది. చరితరెడ్డికి చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆసక్తి, సైక్లింగ్‌ పోటీల్లో ప్రాథమిక స్థాయిలోనే ఉత్తమ ప్రతిభ చాటింది.ఈ నెల 17న జార్ఖండ్‌లో జరుగనున్న జాతీయస్థాయి పోటీల్లో చరితరెడ్డి పాల్గొననుంది.

బీజేపీ కార్యాలయంపై దాడి పిరికిపంద చర్య



డా. వై. రాజ్‌ కుమార్‌

సాక్షి, సిటీబ్యూరో: బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్‌ కార్యకర్తలు దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీజేపీ నగర కార్యవర్గ సభ్యులు డా. వై. రాజ్‌ కుమార్‌ తెలిపారు. బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయంపై దాడిని పిరికిపంద చర్య అని ఇలాంటి పనులు మానుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో లా అండ్‌ ఆర్డర్, ఇంటెలిజెన్స్‌ ఏం చేస్తుందని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే దాడికి పాల్పడిన నిందితుల్ని తక్షణమే అరెస్ట్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. బీజేపీ కార్యకర్తలు సహనం కోల్పోయే వరకు పరిస్థితిని తీసుకరావొద్దని ఆయన సూచించారు.



మాట్లాడుతున్న ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ గట్టుమల్లు

ఆర్టీసీ డ్రైవర్లు ఆదర్శవంతులు

హయత్‌నగర్‌: ట్రాఫిక్‌ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా వాహనాలను నడపడంలో ఆర్టీసీ డ్రైవర్లు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని వనస్థలిపురం ట్రాఫిక్‌ సీఐ గట్టుమల్లు, ఆర్టీసీ హైదరాబాద్‌ రీజియన్‌ డిప్యూటీ మేనేజర్‌ జగన్‌ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని హయత్‌నగర్‌1, 2 డిపోలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. రోడ్డుపై నడిచే లక్షల వాహనాల నడుమ బస్సులు నడిపేందుకు ఎంతో ఏకాగ్రత అవసరమని ఆర్టీసీ డ్రైవర్లు ఎంతో ఓపికతో బస్సులను నడుపుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంలు విజయ్, శ్రీనివాస్, సహాయ మేనేజర్లు విజయకుమారి, రమాదేవి, సత్తయ్య పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు అందజేయడమే కాంగ్రెస్‌ లక్ష్యం



మాట్లాడుతున్న మిద్దెల జితేందర్‌

చంపాపేట: రాష్ట్రంలోని అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేయడమే కాంగ్రెస్‌ లక్ష్యమని తెలంగాణ ప్రదేశ్‌ కాంగ్రెస్‌ సేవాదళ్‌ అధ్యక్షుడు మిద్దెల జితేందర్‌ అన్నారు. మంగళవారం చంపాపేటలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు భూమి లేని వ్యవసాయ కుటుంబాలు, సన్నకారు రైతులకు ఆత్మీయ భరోసా ద్వారా రూ. 12 వేలు అందచేసేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. వ్యవసాయ యోగ్యమైన భూమి రైతులకు ఎకరానికి రూ. 6 వేలు అందించటంతో పాటు రుణమాఫీ చేయటం జరిగిందన్నారు. త్వరలో అర్హులైన పేదలందరికీ కొత్త రేషన్‌ కార్డులు మంజూరు చేస్తారన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఓర్వలేక ప్రతిపక్ష నేతలు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని వాటిని ప్రజలు నమ్మే పరిస్థితులలో లేరన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్ష నేతలు రాష్ట్రంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో దయాకర్, సురేందర్, రమాకాంత్‌ పాల్గొన్నారు.

హరిణ వనస్థలిలో అగ్నిప్రమాదం

నాగోలు: హరిణ వనస్థలి నేషనల్‌ పార్క్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. మంగళవారం సాయంత్రం నాగోలు ఫతుల్లాగూడ వైపు నుంచి ముక్తీఘాట్‌ సమీపంలో పార్క్‌లో నుంచి మంటలు వస్తున్నట్లు గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకుని ఆర్పేశారు. ఈ పార్క్‌లో జింకలు, నెమళ్లు, కుందేళ్లతో పాటు ఇతర జంతువులు ఉంటాయి. ఈ ప్రమాదంలో వన్య ప్రాణులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించినట్లు స్థానికులు చెబుతున్నారు.



పార్క్‌లో ఎగిసిపడుతున్న మంటలు

దీర్ఘకాలిక డ్రైనేజీ సమస్యను పరిష్కరించాం



పనులను పరిశీలిస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్‌: గత కొన్నేళ్లుగా వేధిస్తున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించామని మన్సూరాబాద్‌ కార్పొరేటర్‌ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. మల్లికార్జుననగర్‌కాలనీలోని డ్రైనేజీ పనులను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. డివిజన్‌ పరిధి గణేష్‌నగర్, సాయినాథ్‌కాలనీ, మల్లికార్జున నగర్, ఆగమయ్యనగర్‌కాలనీలు లోతట్టు ప్రాంతాలు కావడంతో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంటూ గత కొన్నేళ్లుగా డ్రైనేజీ మురుగు కాలనీల్లో ఏరులై పారేదన్నారు. ఆరు నెలల నుంచి శ్రమించి ఆర్‌అండ్‌బీ అధికారులను ఒప్పించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించామన్నారు. సుమారు 25 ఏళ్ల నుంచి వేధిస్తున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించామన్నారు.

అసమానతలను నిర్మూలించాలి



మోహన్‌రావును జ్ఞాపికతో సత్కరిస్తున్న దృశ్యం

మన్సూరాబాద్‌: హిందూమతంలో ద్వేషానికి తావు లేదని, అసమానతలను నిర్మూలించాలని ప్రముఖ ఆధ్యాత్మిక గీతాచార్యులు యడ్లపల్లి మోహన్‌రావు అన్నారు. ఎల్‌బీనగర్‌ సూర్యోదయనగర్‌కాలనీలోని జైభారత్‌ ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సనాతన కహళి కార్యక్రమంలో ఆయన హిందూస్‌ ఫర్‌ ప్లూరాలిటీ అండ్‌ ఈక్వాలిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఖదిజ్జాసీ రమణమూర్తితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ.. నేటి యువత భగవద్గీతను చదవాల్సిన అవసరం ఎంతైన ఉందని, గీత గొప్ప స్ఫూర్తిదాయక గ్రంథమన్నారు. రమణమూర్తి మాట్లాడుతూ.. గత మూడు నెలల నుంచి ప్రతి నెల మొదటి వారంలో సనాతన కహళి పేరుతో ప్రముఖ వ్యక్తులచే ఆధ్యాత్మిక ప్రసంగాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహాత్మాగాంధీ క్విట్‌ ఇండియా ప్రసంగాన్ని తెలుగులో అనువదించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం యడ్లపల్లి మోహన్‌రావును సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో బిర్లా మందిరం ప్రధాన అర్చకులు లక్ష్మీ నర్సింహాచార్యులు, అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకరస్వామి, నాయకులు మల్లికావల్లభ, లోక్‌నాథ్, లక్ష్మేశ్వర్, గణేష్‌గల్లా, రాజు, సుధీర్‌ పాల్గొన్నారు.

బీ-బ్లాక్‌ క్వార్టర్స్‌లోకి ఆర్టీఏ కార్యాలయం

మలక్‌పేట: మలక్‌పేట ఆర్టీఏ కార్యాలయం కోసం అక్బర్‌బాగ్‌ డివిజన్‌ బీ–బ్లాక్‌ క్వార్టర్స్‌లో 44 నంబర్‌ బ్లాక్‌ కేటాయించారు. ప్రస్తుతం మరమ్మతు పనులు జరుగుతున్నాయి. పనులు పూర్తిగానే ఆర్టీఏ కార్యాలయం కార్యకలపాలు బీ–బ్లాక్‌ నుంచే కొనసాగనున్నాయి. ఏజెంట్లు ఆఫీసులు, జిరాక్స్‌ సెంటర్లు ప్రభుత్వ క్వార్టర్స్‌లో పెట్టుకునే అవకాశం లేదు. అక్కడ నిర్మాణాలు గానీ, షెడ్స్‌ గానీ వేయడానికి వీలు లేదు. దీనిని అదనుగా భావించిన కొందరు ఆర్టీఏ ఆఫీసు పక్కన అక్రమంగా షెడ్లు ఏర్పాటు చేయడానికి పూనుకుంటున్నారు.

ఇటీవల కొందరు ఇనుపరాడ్లతో షెడ్‌ వేయడాన్ని గమనించిన స్థానికులు మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా అడ్డుకున్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు, పోలీసులు, ఆర్టీఏ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రభుత్వ క్వార్టర్స్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిధుల మంజూరుకు వినతి

హస్తినాపురం: డివిజన్‌ పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని హస్తినాపురం డివిజన్‌ కార్పొరేటర్‌ బానోతు సుజాతానాయక్‌ మంగళవారం జెడ్సీ హేమంత్‌ కేశవ్‌ పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ..డివిజన్‌ పరిధిలోని అనేక ప్రాంతాల్లో కొత్త కాలనీలు పెరుగుతున్నాయని, ప్రజలకు అవసరమయ్యే కనీస వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు.

నేడు ట్రాఫిక్‌ భద్రతా మాసోత్సవాల ర్యాలీ

సైదాబాద్‌: ట్రాఫిక్‌ భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని బుధవారం ఐఎస్‌సదన్‌ చౌరస్తాలో ట్రాఫిక్‌ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నామని సంతోష్‌నగర్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ నరసింహ నాయక్‌ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాతృశ్రీ ఇంజినీరింగ్‌ కళాశాల, వేద డిగ్రీ కళాశాల విద్యార్థులతో నిర్వహిస్తున్న ఈ ర్యాలీకి హైదరాబాద్‌ ట్రాఫిక్‌ అడిషనల్‌ కమిషనర్‌ విశ్వప్రసాద్‌ హాజరవుతారన్నారు. అనంతరం మాతృశ్రీ ఇంజినీరింగ్‌ కళాశాల వద్ద ట్రాఫిక్‌ అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు.

మార్కెట్‌కు ఆదాయం వచ్చేలా పని చేయాలి



మల్లేశం

చాదర్‌ఘాట్‌: రైతులకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించి, మార్కెట్‌కు ఆదాయం వచ్చేలా అధికారులు పని చేయాలని హైదరాబాద్‌ రీజనల్‌ జాయింట్‌ డైరెక్టర్‌ ఆఫ్‌ మార్కెటింగ్‌ అధికారి మల్లేశం ఆదేశించారు. మలక్‌పేటలోని హైదరాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌ను మంగళవారం ఆయన సందర్శించి అధికారులతో సమావేశమయ్యారు.

ఈ సంవత్సరం మార్చి చివరి వరకు రూ. 15 కోట్లు ఆదాయం సమకూర్చాలని ఇప్పటి వరకు దాదాపు రూ. 10 కోట్ల మేర మార్కెట్‌ ఫీజు వసూలైందన్నారు. మార్చిలోపు టార్గెట్‌ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బంది లు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎస్‌జీ ఎస్‌ దామోదర్, గ్రేడ్‌–1 అధికారి చిలుక నర్సింహారెడ్డి, పుష్ప, మాధురి, మహేష్‌ పాల్గొన్నారు.



రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బలాల

వసతుల కల్పనకు ప్రాధాన్యం

సైదాబాద్‌: మలక్‌పేట నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే అహ్మద్‌ బలాల తెలిపారు. మంగళవారం ఆయన సైదాబాద్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ అరుణ రవీందర్‌రెడ్డితో కలిసి శంకేశ్వరబజార్‌లో రూ. 14.70 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రహదారి పనులను ప్రారంభించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను అధికారులు తరచూ పర్యవేక్షిస్తుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, ఎంఐఎం, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



చైతన్య

నాగోలు: బంధువులు ఇంటికి వచ్చిన ఓ యువతి అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..బడంగ్‌పేట, సబితాఇంద్రారెడ్డినగర్‌కు చెందిన పూజారి రాజేష్‌ కుమార్‌ తన కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 22వ తేదీన మధురానగర్‌లో నివాసముంటున్న తన తమ్ముడు ప్రదీప్‌రెడ్డి ఇంటికి వచ్చారు. ఈ నెల 28వ తేదీన రాజేష్‌కుమార్‌ కూతురు చైనత్య(22) ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్పా సెంటర్, సెలూన్లలో పోలీసుల తనిఖీలు

నాగోలు/చైతన్యపురి: ఎల్‌బీనగర్‌ జోన్‌ పరిధిలోని ఎల్‌బీనగర్, చైతన్యపురి, నాగోలు, వనస్థలిపురం తదితర ప్రాంతాల్లోని స్పా సెంటర్లు, సెలూన్‌లలో మంగళవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఎల్‌బీనగర్‌ పరిధిలోని మెట్రో స్టేషన్‌ దగ్గర ఉన్న గోరెన్స్‌ స్పా సెంటర్, చైతన్యపురి పరిధిలో న్యూనాగోలు పరిధిలోని పలు సెంటర్‌ను తనిఖీలు నిర్వహించారు. వనస్థలిపురం పరిధిలో నిర్వహించిన దాడుల్లో కొంమందిని పట్టుకున్నట్లు సమాచారం. సరైన పత్రాలు లేని స్పా సెంటర్లపై చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు. గత రెండు రోజులు ఎల్‌బీనగర్‌ పరిధిలో సెలూన్‌లో, స్పా సెంటర్‌ ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని గుర్తు తెలియని వ్యక్తులు గోడలకు పోస్టర్లు అంటించారు. పోలీసులు పలుమార్లు తనిఖీలు చేసి కేసులు పెట్టిన స్పా సెంటర్ల యజమానుల తీరు మారకపోవడంతో పోస్టర్లు వేసినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

మలక్‌పేట: అక్బర్‌బాగ్‌ డివిజన్‌ పరిధి మలక్‌పేట చంచల్‌గూడ ప్రధానరోడ్డులో ఉన్న ఆఫీసర్స్‌ మెస్‌ వద్ద మంగళశారం ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు పక్కనే ఉన్న మలక్‌పేట ఫైర్‌ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌ నుంచి మంటలు రావడంతో రెండువైపులా ట్రాఫిక్‌ నిలిచిపోయింది. ఓవర్‌ లోడ్‌ కారణంగా మంటలు చెలరేగి ఉండొచ్చని ఇన్‌చార్జి ఫైర్‌ ఆఫీసర్‌ అంజిరెడ్డి పేర్కొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌లో చెలరేగుతున్న మంటలు



ఆర్పుతున్న ఫైర్‌ సిబ్బంది